మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# మార్చి14నుంచి పదో తరగతి పరీక్షలు

**- మహబూబ్‌నగర్ జిల్లాలో 13,271 మంది విద్యార్థులు**

**- డీఈవో ప్రవీణ్‌కుమార్ వెల్లడి**




**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్9, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 14.03.2026 నుండి 16.04.2026 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఏ.ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పరీక్షలు ఉదయం9.30 గంటలనుండి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయని, సామాన్య శాస్త్ర పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు బాగా సిద్ధం కావడం కోసం ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవడం కోసం పరీక్షకూ పరీక్షకూ మధ్య కావలసినంత వ్యవధిని ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఇప్పటివరకు 13271 మంది విద్యార్థులు పదవతరగతి పరీక్షలు రాయడం కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు. అరవైకి పైచిలుకు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని వారు తెలియజేసారు. ఇతర వివరాలకోసం ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ జి.కమలాకర్ ని సంప్రదించాలని తెలియజేశారు.

# ఏసీబీ వలలో ఏఈ

**- ఓ ఫామ్ హౌస్‌లో లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

**- జడ్చర్లలోని ఏఈ ఇంట్లో మరొక బృందం సోదాలు**



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఇన్‌చార్జి ఏఈ

**వెల్దండ, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** వెల్దండ మండల విద్యుత్ ఇంచార్జ్ ఏఈ వెంకటేశ్వర్లు గత ఆరు నెలలగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ మీటర్ ఏర్పాటు కోసం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడి. వివరాల్లోకి వెళ్లితే.. వెల్దండ మండల కేంద్ర పరిధిలోని చొక్కన్నపల్లి గ్రామ సమీపంలోనీ ఓ ఫాంహౌస్‌లో విద్యుత్ మీటర్ ఏర్పాటు కోసం విద్యుత్ ఏఈ రూ.20వేలు డిమాండ్ చేయగా ఫిర్యాదు దారుడు రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకొని ఫామ్ హౌజ్‌లో నగదు ఇస్తుండగా దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని ఏఈ వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకొని వెల్దండ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఫిర్యాదుదారుడు ఈనెల 5వ తేదీన ఏసీబీ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పూర్తిస్థాయి ఆధారాలతో దాడులు నిర్వహించి కస్టడిలోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా పనులు చేయడానికి లంచం డిమాండ్ చేసినట్లయితే ఏసీబీ అధికారుల టోల్ ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేసి సమాచారం అందజేయాలని ఏసీబీ డీఎస్పీ సూచించారు. ఈ దాడులలో సీఐ లింగస్వామి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

# ప్రాణాలను ఫణంగా పెట్టి త్యాగం

**- కేసీఆర్ దీక్ష వల్లే కేంద్రం దిగి వచ్చింది**

**- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్9,ప్రభాతవార్త :** కేసీఆర్ ఆమరణ దీక్షతో నాటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణను ప్రకటించిన రోజైన డిసెంబర్ 9న విజయ్ దివస్‌ను మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లుఅర్పించిన అంతరం స్థానిక నాయకులతో కలిసి గాలిలోకి బెలూన్లు ఎగరవేశారు. ఉద్యోగుల సిద్ధిపేట సభలో ఆమరణ నిరాహార దీక్షకు కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారు కెసిఆర్ నాయకత్వంలో అందరూ కలిసి పోరాటం చేసి తెలంగాణ సాధించుకోవడం జరిగింది. ఉద్యమంలో మహబూబ్ నగర్ కీలకమని చెప్పాలి. మహబూబ్ నగర్ ఎంపీగా కెసిఆర్ గారు ఉన్న సమయంలో తెలంగాణ సాధించారు. ఉద్యమంలో కెసిఆర్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో ఢిల్లీని వణికించి ప్రత్యేక రాష్ట్ర ప్రకటనను సాధించిన రోజు డిసెంబర్ 9"విజయ్ దివస్" స్ఫూర్తిని భావితరాలకు అందించాలని పేర్కొన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్ త్యాగం చిరస్మరణీయమని అభివర్ణించారు. ఉద్యమం మొదలు దీక్ష విరమణ వరకు కెసిఆర్ గారి వెంట మేము ఉన్నాం తెలంగాణ ఏర్పడటంతోనే ఇక్కడి వారికీ పదవులు..తెలంగాణ సంపదతో ప్రజలకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయి, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసాము తెలంగాణ సాధనలో అమరుల త్యాగాలు గొప్పవి ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసి నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజు, సీనియర్ నాయకులు తాటి గణేష్,గిరిధర్ రెడ్డి, నవకాంత్, శ్రీనివాస్ రెడ్డి, మోహన్బాబు అహ్మదుద్దిన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తా వద్ద బెలూన్లు ఎగురవేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

# వేడెక్కిన రాజకీయం



- మంతనాలు, మందు పంపిణీలో అభ్యర్థులు బిజీబిజీ
- మద్యం దుకాణాలు మూసివేత
- రేపు తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికలు
- ఏర్పాటు పూర్తి చేసిన అధికారం యంత్రాంగం
- ఎన్నికల మండలాల్లో బీఎన్ఎస్ యాక్ట్ 163అమలు




**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్9, ప్రభాతవార్త :** పంచాయతీ ఎన్నికల తొలి విడుతకు సమయం ఆసన్నమైంది. రేపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయి. ఈమేరకు మంగళవారం సాయంత్రం 5గంటల వరకు ప్రచారం ముగిసింది. ఎన్నికలు జరుగుతున్న మండలాల్లో ఈనెల 11సాయంత్రం ఓట్ల తెక్కింపు వరకు అన్ని మద్యం దుకాణాలను మూసివేశారు. ఈమేరకు 163 బీఎన్ఎస్ యాక్ట్ అమలులలో ఉండనున్నది. ప్రచారం ముగియడంతో ఆయా పార్టీల అభ్యర్థులు తమ గెలుపే లక్ష్యంగా మంతనాలు, మందు పంపిణీలో బిజీ బిజీ ఉన్నారు. ఎన్నికలకు ఒక్క రోజే ఉండడంతో పల్లె రాజకీయం వేడెక్కింది.

## జిల్లాల్లో ఇలా..

మహబూబ్నగర్ జిల్లాలోని ఐదు మండలాల్లో 139 గ్రామపంచాయతీలో 10 పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 129 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 20 మండలాల్లో 440 గ్రామపంచాయతీలో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మొదటి విడత కల్వకుర్తి వెల్దండ వంగూరు ఊరుకొండ తాడూరు తెలకపల్లి మండలాల పరిధిలోని 151 గ్రామపంచాయతీలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. ఇప్పటికే 14 గ్రామపంచాయతీలు ఏక గ్రామం అయినట్లు తెలిసింది. వనపర్తి జిల్లాలో పెద్ద మందడి, ఖిల్లా ఘనపురం, రేవల్లి, గోపాల్‌పేట ఏదుల మండలాల్లోని 87 గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో మొదటి విడతలో గద్వాల, ధరూర్,గట్టు, కేటి దొడ్డి మండలాల్లోని 106 గ్రామపంచాయతీలు 794 వార్డు సభ్యులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో 15 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాక మిగిలిన పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 151 పంచాయతీల్లో 14 పంచాయితీలు ఏకగ్రీవం కాగా 131 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 441 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

## నిషేధాజ్ఞలు అమలు

**– మద్యం దుకాణాలు మూసివేత**

మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 11న జరగనున్న తొలివిడత గ్రామ పంచాయతీఎన్నికల సందర్భంగా, ఎన్నికల ప్రచారంపై ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయినీదేవి, జిల్లాఎన్నికల అధికారి కలెక్టరేట్ విజయేంద్ర బోయి కీలక ఆదేశాలు జారీ చేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే గండీడ్, నవాబ్ పేట, రాజాపూర్, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్ అనే ఐదు మండలాల పరిధిలో మంగళవారం (డిసెంబర్ 9) సాయంత్రం 5:00 గంటలకు ప్రచారం ముగిసిందని. తెలిపారు. ఎన్నికల సజావుగా నిర్వహణ కోసం ఇప్పటికే ఈ ఐదు మండలాల్లో నిషేధాజ్ఞలు మంగళవారం సాయంత్రం 5గంటల నుండి (బీఎన్ఎస్ 163)అమలులోకి వస్తాయి. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం.

## మద్యం దుకాణాలు బంద్

మంగళవారం(డిసెంబర్ 9) సాయంత్రం 5గంటల నుంచి డిసెంబర్ 11వ తేదీ పోలింగ్ మరియు ఓట్లలెక్కింపు ముగిసే వరకు పోలింగ్ జరిగే ఈ ప్రాంతాలలో అన్ని మద్యం దుకాణాలను మూసి వేయాలని అధికారులు ఆదేశించారు.

## ఇవీ పోలింగ్ వివరాలు

పోలింగ్ డిసెంబర్ 11వ తేదీ, గురువారం ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహించబడుతుంది.

## ఓట్ల లెక్కింపు

పోలింగ్ ముగిసిన అనంతరం, అదే రోజు (డిసెంబర్ 11నాడు) మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతుందని, లెక్కింపు పూర్తి అయిన తర్వాత ఫలితాల వెల్లడి జరుగుతుందని మహబూబ్‌నగర్ ఎన్నికల అధికారి కలెక్టర్ విజయేంద్ర బోయి తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

# కోడూరును కొత్తగా మార్చుకుందాం..

**- అండర్ గ్రౌడ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేసుకుందాం**

**- కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి: ఎమ్మెల్యే యెన్నం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్9,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని కోడూరు గ్రామంలో ప్రజలు మార్పుకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఈటే ఉమాదేవి రవీందర్‌కు మద్దతుగా ప్రకటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, కోడూరు గ్రామం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే కలహాలు లేని కోడూరు అవసరమని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలన్న మంచి ఆలోచనతో ముందుకు వస్తున్న ఈటె ఉమాదేవి రవీందర్ ఉంగరం గుర్తు పైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి" అని ఆయన ప్రజలను కోరారు. గత పది సంవత్సరాలుగా కోడూరులో అభివృద్ధి నిలిచిపోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. "సొంత బిడ్డనే చూసుకోని వారు, గ్రామ ప్రజలను ఎలా చూసుకుంటారు?" అని ప్రశ్నిస్తూ, కోడూరు ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే విధంగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్ లలో ఉచిత ప్రయాణ సౌకర్యాలు అందిస్తున్నామని, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని ఆయన గుర్తు చేశారు. గ్రామంలోని ప్రతి వాడాలో సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కోడూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజలు ఒకతాటిపైకి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సర్పంచ్ అభ్యర్థి ఈటె ఉమాదేవి రవీందర్, నాయకులు ఖాజా, కేశవులు, , ఆంజనేయులు, అంజి, పురుషోత్తం, రామస్వామి, ప్రసాద్, చందు, కృష్ణ యాదవ్, దాక్య నాయక్, రమేష్, అర్జున్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కడే వచ్చి.. చీపురు పట్టి ఊడ్చి..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఆశ్చర్యానికి గురి చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- తెల్లవారుజామున గన్‌మెన్లు, అధికారులు లేకుండానే పర్యటన
- జడ్చర్లలో పురవీధుల్లో పరిశీలన
- అపరిశుభ్రంగా ఉన్న యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశం



కొయ్య చీపురుతో రోడ్డు ఊడ్చి చూస్తున్న అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** గన్ మెన్లు, సిబ్బంది, అధికారులు, వాహనాల హడావిడి ఏమాత్రం లేకుండా ఓసాదాసీదా టీషర్టు ధరించి ఒంటరిగా నడుచుకుంటూ జడ్చర్ల పట్టణంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చేసిన ఆకస్మిక పర్యటన ప్రజలందరినీ ఆశ్చర్యపరిచింది. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మంగళవారం తెల్లవారుఝామున 5 గంటల సమయంలో జడ్చర్ల పట్టణంలో ఆకస్మికంగా పర్యటించారు. అయితే తన పర్యటన గురించి అధికార సిబ్బందితో సహా ఎవరికీ సమాచారం ఇవ్వకుండా తెల్లవారుజామున ఒంటరిగా పట్టణంలోకి వచ్చారు. స్థానిక గాంధీబొమ్మ వద్ద నుంచి తన నడకను మొదలుపెట్టిన ఎమ్మెల్యే అక్కడి నుంచి పాతబస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడినుంచి కోటమైసమ్మ గుడిప్రాంతానికి వెళ్లారు. ఆప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం పాత బజారులోని వివిధ ప్రాంతాలను పరిశీలిస్తూ బూరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయం దాకా వెళ్లారు. అటునుంచి మళ్లీ రైల్వేస్టేషన్ రోడ్ మీదుగా నేతాజీచౌరస్తాదాకా నడుచుకుంటూనే తిరిగారు. మార్గమధ్యంలో రోడ్లను ఊడుస్తున్న పారిశుధ్య కార్మికులతో అనిరుధ్ రెడ్డి ముచ్చటించారు. మీకు సమస్యలేమైనా ఉన్నాయా? అని వారితో ఆరా తీసారు. – మిగతా4లో..



సూచనలు చేసిన ఎస్పీ జానకీ ధరావత్

# పోలీస్ శాఖ సన్నద్ధం

- పంచాయితీ ఎన్నికలపై నిఘా
- మొదటి విడుత 139 పంచాయతీల్లో ఎన్నికలు
- విధుల్లో 1186మంది పోలీసులు
- పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం
- సూచనలు చేసిన ఎస్పీ జానకీ ధరావత్



స్థానిక సంస్థల మొదటి విడత ఎన్నికల నేపథ్యంలో, మహబూబ్‌నగర్ పోలీస్ కవాతు మైదానంలో అధికారులు సిబ్బందికి ఎన్నికల విధులపై స్పీ జానకీ ధరావత్ సమగ్ర బ్రీఫింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలింగ్ బూతుల్లో భద్రత, రూట్ మొబైల్ టీంలు, క్యూ.ఆర్.టీ, స్ట్రైకింగ్ ఫోర్స్ అన్ని ప్రత్యేక బృందాలు చేపట్టాల్సిన పనులు, నివారించాల్సిన అంశాలను స్పష్టంగా వివరించారు. మొదటి విడుత విధుల్లో 1180మంది పోలీసు సిబ్బంది ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.

మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్9, ప్రభాతవార్త



హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు
- కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి : దేవరకద్ర ఎమ్మెల్యే



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, డిసెంబరు 9 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. మంగళవారం కౌకుంట్ల మండల పరిధిలోని ముచ్చింతల, అప్పంపల్లి, దాసరిపల్లి, గ్రామాలలో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మచీరలు పంపిణీ చేస్తామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను – మిగతా4లో..

## జడ్చర్ల దవాఖానలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల, డిసెంబర్9,ప్రభాతవార్త :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ఉద్యమ సారథి కేసిఆర్ 29.11.2009 రోజు నుండి 11 రోజులు స్వరాష్ట్రం కోసం దీక్ష దివస్ (ఆమరణ దీక్ష ) చేపట్టి 9డిసెంబర్ 2009న ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వెలువడిన తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాకారానికి తొలి అడుగు పడ్డ చారిత్రక రోజును పురస్కరించుకొని జడ్చర్లలో బీఆర్ఎస్ జెండాలతో దీక్షాదివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి , బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డా. చర్లకోల లక్ష్మారెడ్డి సూచన మేరకు జడ్చర్లలో పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని దీక్ష విజయ్ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ దోరేపల్లి లక్ష్మీ రవీందర్, మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ పాలాది సారిక రాంమోహన్, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పిట్టల మురళి, మున్సిపల్ కౌన్సిలర్స్ ఉమా శంకర్‌గౌడ్, , బుక్క మహేశ్, లత,మాజీ డైరెక్టర్స్, మాజీ మూడా డైరెక్టర్స్, నాయకులు కరాటే శ్రీను, శ్రీనివాస్ యాదవ్, అంజి, శివకార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా భీమా సఖీ వార్షికోత్సవాలు

**గద్వాలటౌన్ ,డిసెంబర్ 9, ప్రభాతవార్త:** భీమాసఖీ పాలసీ వార్షికోత్సవాల సందర్భంగా గద్వాల ఎల్ఐసి బ్రాంచిలో ఏజెంట్లు, ఉద్యోగుల ఆధ్వర్యంలో వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఎల్ఐసి ఆఫీస్ ఆవరణలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కులశేఖర్ భీమా సఖి యోజన ప్రారంభించి ఒక సంవత్సరం అయినందున కేకు కట్ చేశారు. ఇందులో భాగంగా ఎల్ఐసి బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బి రంగారావు మాట్లాడుతూ...భీమా సిఖి ఏజెంట్ స్కీమ్ ప్రారంభించిన రెండు సంవత్సరాలలోపు దేశవ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది బీమా సఖి ఏజెంట్లను నియమించడం గొప్ప విజయం అన్నారు. భీమా సఖి స్కీమ్ ద్వారా మహిళలకు ఎల్ఐసీ ఏజెంట్ గా పనిచేసే అవకాశాన్నీ కల్పించడం, అందులోను పరిమితులకు లోబడి నెలకు కొంత పారితోషికాన్ని ఇవ్వడం వలన ఇది సాధ్యమైందన్నారు. అందుచేత ఈ భీమా సఖి వారందరికీ ఒక సదవకాశంగా లభించిందన్నారు.ఇన్సూరెన్స్‌ను ప్రజలు ఇప్పటికి కూడా తమంతకు తామే కొనుకోవడం లేదనీ, ఎవరో ఒకరు ఇన్సూరెన్స్ ప్రాధాన్యత గురించి చెబితే తప్ప ముందుకు రారనీ, అందుచేత అలా చెప్పే క్రమంలో మహిళలు ఇన్సూరెన్స్ గురించి ప్రస్తావిస్తూ దాని ప్రాముఖ్యతను చెప్పడానికి ప్రయత్నం చేస్తే ఎక్కువ మంది పాలసీలు చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కులశేఖర్ , ఏబీఎన్ శ్రీనివాసులు, ఏవో దివాకర్ గ బీమా సఖి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## సూర్య తండా పంచాయతీ ఏకగ్రీవం



నారాయణ

**ఉప్పునుంతల, డిసెంబరు 9 ప్రభాతవార్త :** మండలంలోని సూర్య తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా మూడవత్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకు గాను ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది.సూర్యతండాలో నాలుగు నామినేషన్లు వేశారు. మూడవత్ నారాయణ రెండు, మాజీ సర్పంచ్ బాలు నాయక్,దేవేందర్‌లు నామినేషన్ దాఖలు చేయగా, పరిశీలనలో మూడవత్ నారాయణ ఒక నామినేషన్ పరిశీలనలో పోగా , మూడు నామినేషన్‌లు మిగిలాయి. మంగళవారం జరిగిన ఉప సంహరణలో సూర్య తండాకు చెందిన బాలు నాయక్, దేవేందర్ ఉపసంహరించుకోవడంతో మూడవత్ నారాయణ ఒకే నామినేషన్ ఉండడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి మహేష్ కుమార్ ప్రకటించారు. అదేవిధంగా గ్రామపంచాయతీలో 6వార్డులకు 6 వార్డు లు ఏకగ్రీవం అయినట్లు ఆయన ప్రకటించారు. అదే విధంగా మండలంలోని గువ్వల లోని పల్లి సెక్టార్ పరిధిలో 8 వార్డులు ఏకగ్రీవం అయినట్లు ఆర్ఓ ఆంజనేయులు తెలిపారు. ఉప్పునుంతల సెక్టార్ పరిధిలో కంసానిపల్లి తండా 3వార్డులు ఏకగ్రీవం అయినట్లు ఆర్ఓ వెంకటయ్య తెలిపారు.

## రమావత్ రవికుమార్‌కు బంగారు పతకం

**- అభినందించిన పీయూ వీసీ శ్రీనివాస్**

**మహబూబ్‌నగర్,డిసెంబర్9,ప్రభాతవార్త:** మంగళవారం పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో పాలమూరు యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ సిఎస్ఎమ్ మొదటి సంవత్సరం చదువుతున్న రమావత్ రవికుమార్ రాష్ట్ర స్థాయిలో ఆర్చరీ పోటీలు జూనియర్స్ అండ్ సీనియర్స్ లెవెల్స్‌లో పాల్గొని సీనియర్స్ లెవెల్లో బంగారు పథకం సాధించాడు. అలాగే జూనియర్స్ లెవెల్లో కాంస్య పతకాన్ని సాధించి పాలమూరు యూనివర్సిటీకి గుర్తింపు తీసుకొచ్చాడు. ఈ క్రీడల్లో పాల్గొన్న రామావత్ రవికుమార్ గతంలో కూడా అనేక ఈవెంట్లలో పాల్గొని అనేక బహుమతులను పొందాడు. రాష్ట్ర స్థాయిలో జరిగినటువంటి పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనందుకు పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి ఎన్. శ్రీనివాస్ రామావత్ రవి కుమార్‌ని ప్రత్యేకంగా అభినందించి గోల్డ్ మెడలను అందించాడు అలాగే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రమేష్ బాబు, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ చంద్ర కిరణ్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ పి రామరాజు, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాస్ రామావత్ రవి కుమార్‌ని ప్రత్యేకంగా అభినందించారు.

## సాంస్కృతిక వారసత్వానికి

## ప్రతీక తెలంగాణ తల్లి విగ్రహం



ఐడిఓసి ఆవరణలో తెలంగాణ
తల్లి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా అధికారులు

**వనపర్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, సాంస్కృతిక వారసత్వానికి తెలంగాణ తల్లి విగ్రహం ప్రతీకగా నిలుస్తుందని జిల్లా అటవీశాఖ అధికారి అరవింద్ ప్రసాద్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఐడిఓసి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం జిల్లా అటవీశాఖ అధికారి అరవింద్ ప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, సాంస్కృతిక వారసత్వానికి తెలంగాణ తల్లి విగ్రహం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఐడిఓసిలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం జిల్లా ప్రజలకు స్ఫూర్తి నింపేలా ఉండాలని ఆకాంక్షి స్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయా లు, విలువలను చేరవేయడానికి ఈ విగ్రహం ఉపయోగపడుతుందని తెలిపారు. ఐడిఓసి ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ఎత్తు 12 అడుగులు ఉండగా, దిమ్మె ఎత్తు ఆరు అడుగులు, మొత్తంగా 18 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడికి ఘనస్వాగతం

**భూత్పూర్,డిసెంబర్ 9,ప్రభాతవార్త :** బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే మంగళవారం పాలమూరు ఉమ్మడి జిల్లాల పర్యటనకు వచ్చారు.వనపర్తి జిల్లా ఖిల్లాఘన్‌పూర్ మండల కేంద్రంలో జరిగే ఓ కార్యక్రమానికి హాజరౌతున్న సందర్భంగా మంగళవారం ఉదయం భూత్పూర్‌కు చేరుకున్న గణేష్ కుండేకు పాలమూరు జిల్లా,భూత్పూర్ మండల బీజేపీ,బీజేవైఎం,వీహెచ్‌పి నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.బీజేపీ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎండి ఫారూక్‌తో పాటు మండల నాయకులు కెంద్యాల శ్రీనివాసులు,రాజ్‌గోపాల్, లిక్కి హరినాథ్,ముత్యాల నర్సింహులు,వెంకటేష్,విజయ్,పట్నం శ్రీశైలం,ఎంకంపల్లి మల్లేష్,చీపుర్ల భీంసేన్ తదితరులు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

## ఘనంగా విజయ్ దివాస్ వేడుకలు



తెలంగాణ తల్లి విగ్రహనికి పూలమాలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి,డిసెంబర్ 9 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన డిసెంబర్ 9 అని కేటీఆర్ గుర్తుచేశారు. ఈసందర్భంగా విజయ్‌దివాస్ కార్యక్రమాల్లో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని మహబూబ్‌నగర్‌చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ విగ్రహానికి, తహసీల్దార్ కార్యాలయం ముందు ఉన్న తెలంగాణ తల్లీ విగ్రహాలకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మెన్లు ఎడ్మ సత్యంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన కృషిని తెలియచేస్తూ ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, నాయకులు బావాండ్ల మధు, మనోహర్ రెడ్డి, సైదులు గౌడ్, భగత్ సింగ్, మల్లేష్, ఖాదర్, సూరి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ సన్నద్ధం

**- పంచాయితీ ఎన్నికలపై నిఘా**

**- మొదటి విడుత**

**139 పంచాయతీల్లో ఎన్నికలు**

**- విధుల్లో 1186మంది పోలీసులు**

**- సూచనలు చేసిన ఎస్పీ జానకీ ధరావత్**

**ఎన్నికల విధుల్లో పోలీస్ శాఖ**
**ఒక సూపరింటెండెంట్ ఆఫ్‌పోలీస్**
**ఇద్దరు అదనపు ఎస్పీలు**
**ముగ్గురు డీఎస్పీలు**
**16మంది సీలు**
**57 ఎస్సైలు,**
**167ఏఎస్సైలు,హెచ్‌సీలు**
**647పోలీస్ కానిస్టేబుళ్లు**
**293హోంగార్డులు**
**28 సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు**
**39రూట్ మొబైల్ పార్టీలు ఏర్పాటు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్9, ప్రభాత వార్త :** స్థానిక సంస్థల మొదటి విడత ఎన్నికల నేపథ్యంలో, మహబూబ్‌నగర్ పోలీస్ కవాతు మైదానంలో అధికారులు సిబ్బందికి ఎన్నికల విధుల పై సమగ్ర బ్రీఫింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డీ. జానకి, పోలింగ్ బూతుల్లో భద్రత, రూట్ మొబైల్ టీంలు, క్యూ.ఆర్.టీ, స్ట్రైకింగ్ ఫోర్స్ అన్ని ప్రత్యేక బృందాలు చేపట్టాల్సిన పనులు, నివారించాల్సిన అంశాలను స్పష్టంగా వివరించారు.

**ఇవీ పోలీస్ శాఖ సూచనలు..**

- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలను కఠినంగా పర్యవేక్షించి వెంటనే చర్యలు తీసుకోవాలి.
- అభ్యర్థులు, ఏజెంట్లు, రాజకీయ కార్యకర్తల ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా పూర్తి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి.
- పోలింగ్ స్టేషన్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, మద్యం/డబ్బు/ఉచితాలు పంపిణీ వంటి అక్రమాలపై నిఘా.
- ప్రతిఓటరు స్వేచ్ఛగా,ఎలాంటి భయం లేకుండా ఓటు వేయగల వాతావరణాన్ని కల్పించాలి.
- సోషల్ మీడియాలో వ్యాపించే పుకార్లు, తప్పుడు సమాచారాన్ని పర్యవేక్షించి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
- అత్యవసర సమాచారం అందిన వెంటనే పై అధికారులను అప్రమత్తం చేస్తూ, సమన్వయాన్ని పటిష్టంగా కొనసాగించాలి.
- చిన్న గొడవలనైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించి, శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడాలి.

ఎన్నికల సమయంలో ఎటువంటి అక్రమాలు చోటుచేసుకోకుండా, ప్రతి పోలీస్ యూనిట్ సమన్వయంతో పనిచేసి ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కువినియోగించుకునేలా అన్నిఏర్పాట్లు చేశాం. ప్రజల భద్రత మాప్రధాన ధ్యేయం. శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను కఠినంగా అణచివేస్తాం. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలి" అని సూచించారు.

**ఎన్నికల విధుల్లో సిబ్బంది**

మొదటి విడత మొత్తం 139 గ్రామ పంచాయతీల్లో 7ఏకగ్రీవం కాగా 132 గ్రామపంచాయతీల్లో జరిగే స్థానాలలో 28 సమస్యాత్మక 104 సాధారణ 167 పోలింగ్ లొకేషన్‌లలో 1188 పోలింగ్ స్టేషన్లను ఉన్నాయి. ఇందుకుగాను 39రూట్ మొబైల్ పార్టీలు, 5 స్ట్రైకింగ్, 5 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు నియమించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డిటిసి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు మరియు పోలీసు సిబ్బంది .

# సోనియాగాంధీ వల్లే తెలంగాణ సాకారం..

- **డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్**
- **ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ఏర్పాటు**
- **టీజీఎంఎఫ్సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్**



కేక్ కట్ చేస్తున్న సంజీవ్‌ముదిరాజ్, నాయకులు

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 9,ప్రభాతవార్త :** సోనియాగాంధీ వల్లే ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మీడియాతో సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ యూపీఏ ఛైర్పర్సన్‌గా ఉన్న సోనియాగాంధీ తెలంగాణ ఆకాంక్షల మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. తెలంగాణ అమరుల ప్రాణత్యాగాన్ని గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను గుర్తించి, సీడబ్ల్యూసీలో చర్చించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందన్నారు. సంక్షేమం. అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలే కాంగ్రెస్ పార్టీ స్థంభాలు అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ భావాజాలాన్ని తప్పుపట్టడం సరికాదన్నారు. మతాలు, కులాల పేరు మీద రాజకీయాలు చేయడం సరికాదన్నారు. భారతదేశ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు లింగం నాయక్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, ఫయాజ్, ఆవేజ్, బండి మల్లేష్, ఫక్రూ, వెంకటలక్ష్మి, రామలక్ష్మి, అబ్దుల్ హక్, ప్రవీణ్ కుమార్, ఖాదర్, షాఫైసల్, తాహేర్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర ప్రకటన

**దీక్షా దివాస్‌లో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు**



చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల డిసెంబర్ 9, ప్రభాతవార్త:** ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కెసిఆర్ చేసిన దీక్ష వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రకటన నేడు చేసిన రోజని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు.. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రకటన దీక్షా విజయ్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొని తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు..ఈ సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ స్వరాష్ట్రం కోసం 11 రోజులు ఆమరణ దీక్ష చేపట్టి ఢిల్లీ మెడలు వంచిన రోజు అని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వెలువడి తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాకారానికి తొలి అడుగు పడ్డ చారిత్రక రోజు అన్నారు. అదేవిధంగా ఆర్.కిషోర్ మాట్లాడుతూ..చరిత్ర గతిని మార్చింది కేసీఆర్ దీక్ష. అని అది తెలంగాణ రాష్ట్ర అవతరణకు నాంది పలికిన సఫలదీక్ష అని అలాగే ఆత్మగౌరవ జ్యోతి వెలిగిన ఆత్మ విశ్వాసం పొందిన రోజు అని గుర్తు చేశారు. తెలంగాణ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికిన రోజు అని దశాబ్దాలుగా సాగుతున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు దిశానిర్దేశం చేసిన కీలక ఘట్టం అని అన్నారు. స్వరాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమ సారథులకు, అమర వీరులందరికీ హృదయ పూర్వక వందనం. తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన దీక్షా విజయ్ దివాస్ చరిత్రలో చెరగని అధ్యాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు, బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి

**అమరచింత డిసెంబర్ 9, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని మస్తీపూర్ గ్రామంలో నందిమల్ల, కొంకన్వాని పల్లె, చంద్ర నాయక్ తండ, నందిమల్ల, కృష్ణంపల్లి గ్రామాల బిజెపి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. బంగ్లా లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ్రామాలు అభివృద్ధి చెందాలని లక్ష్యంతో నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపి స్తున్నారని ఆయన అన్నారు. అలాగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గ్రామ ప్రజలు ఆదరిస్తే పాల మూరు బిజెపి ఎంపీ,డీకే అరుణ గ్రామాల అభివృద్ధి కోసం 10 లక్షలు నిధులు కేటాయిస్తుందని గ్రామాల అభివృద్ధి కొంకు బిజెపి నాయ కులను బలపరచాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజెపి కార్యకర్తలు ప్రతి గడపకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలను కోరారు. గ్రామాలలో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా కేంద్ర ప్రభుత్వం నిధులతో వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. దేశానికి రక్షణ కవచంగా ఉన్న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బలపరి చిన బిజెపి నాయకులకు అండగా నిలవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, మెరువరాజు,మండల ఇన్చార్జి,మంగలావణ్య, బిజెపి సీనియర్ నాయకులు, క్యామ భాస్కర్, బిజెపి మండల కార్యదర్శి, వినోద్ కుమార్, బిజెపి నాయకులు, తోకలి భీమసేన, దోస్త్ మోహన్, కృష్ణ నాయక్, దామోదర్ రెడ్డి, కెప్టెన్ ప్రభాకర్, డబ్బా సుజాత, బిజెపి సీనియర్ నాయకులు, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, గోవర్ధన్, నరసింహ, అంకె అంజి, వేద విష్ణు, అర్జున్ కుమార్, మెరువ అనిల్, ఒగ్గు వెంకటేష్, ముష్టి విజయ్, కుమ్మరి రాజు,హరికృష్ణ,ఉదయ్‌గౌడ్,ఆయా గ్రామాల బిజెపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విద్య సాధన కోసం నిరంతర పోరాటాలు

**పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు**



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

**ఆత్మకూర్ డిసెంబర్ 9, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో పిడిఎస్‌యు వనపర్తి జిల్లా నాలుగవ మహాసభలు మంగళవారం రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరిట విద్యార్థుల మధ్య మతోన్మాదం రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను సమాజంలోని మేధావులు మరియు విద్యార్థిని విద్యార్థులు సమర్థవంతంగా పిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కేంద్రంలో విద్యాశాఖకు అరకొర నిధులు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు విద్యను దూరం చేసే విధంగా చేస్తున్న ప్రయత్నాలు కూడా పిడిఎస్‌యు ఘాటంగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విద్యాశాఖను తన వద్ద ఉంచుకొని విద్యాశాఖకు ఏమాత్రం అధికారాలు కట్టబెట్టకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని గతంలో కేసీఆర్ మాదిరిగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వ్యవహరిస్తున్న తీరును విద్యార్థిని విద్యార్థులతో పాటుగా మేధావి వర్గం కూడా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని గత శాసనసభ ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది కాలంగా నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయకుండానే కాలం వెళ్లదీయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్లో 40 శాతం నిధులను కేటాయించి కేజీ నుండి పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఇతర విద్యార్థి సంఘాలతో కలిసి రాజీలేని పోరాటాలు కొనసాగించేందుకు నిరంతరం పిడిఎస్యు అగ్రభాగాన ఉంటుందని ఆయన అన్నారు. ఈ సమావేశానికి పిడిఎస్సి వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కమిటీ నాయకులు శివ, దిలీప్, కుమార్, వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పిడిఎస్‌యు మహాసభలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులు

## 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

**దేవరకద్ర, డిసెంబరు 9 ప్రభాతవార్త:** ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం దోకూర్ పరిధిలోని కేజీబీవీ గాంధీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లు, వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థుల గదులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ అనురాధ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## అయ్యవారిపల్లి సర్పంచ్
## అభ్యర్థిగా డీసీసీ ప్రధాన కార్యదర్శి



జిల్లెల్ల జగత్ రెడ్డి

**ఉప్పునుంతల,డిసెంబరు 9 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో అయ్యవారిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్ రెడ్డి రంగంలో ఉన్నారు. తమిళనాడు ఏఐసీసీ పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, మండల నాయకులు ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా జిల్లెల్ల జగత్ రెడ్డి రంగంలో ఉన్నారు.

## ఘనంగా పాస్టర్స్ క్రిస్మస్ సంబరాలు



సంబురాలు చేసుకుంటున్న పాస్టర్స్

**జడ్చర్ల,డిసెంబర్9,ప్రభాతవార్త:** జడ్చర్లపట్టణంలోని సెంటినరీ ఎం.బి.చర్చిలో నియోజకవర్గ పాస్టర్స్, వారి కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ సంబరాలను నిర్వహించారు.ముఖ్య సందేశాన్ని హైదరాబాద్‌కు చెందిన రెవరెండ్ డాక్టర్ జీవరత్నం క్రిస్మస్ అందించారు. ప్రత్యేక గీతాలాపన, బైబిల్ ధ్యానము ప్రార్థనలు చేసి క్రిస్మస్ కేక్ కటింగ్ చేశారు అనంతరం దేశ రాష్ట్ర క్షేమాల కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ కే.విలియంబూత్,కార్యదర్శి డి.సువార్తరాజ్, కోశాధికారి నాతాన్, రవిబాబు,స్టీవెన్‌రాజ్, ఏలియా, రత్నం, ప్రకాష్ ,ఆశీర్వాదం, జాన్,భాస్కర్,పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బందికి
## ఒకే విధమైన రెమ్యునరేషన్ ఇవ్వాలి

**స్టేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీధర్ రావు**

**ఉప్పునుంతల,డిసెంబరు 9, ప్రభాతవార్త:** ర్యాండమైజేషన్ పేరుతో ఒకరికే అన్ని దఫాల ఎన్నికల విధులు వేయరాదని ఎస్టియు టీఎస్ జిల్లాఅధ్యక్షులు కొత్త శ్రీధర్‌రావు సూచించారు. వికలాంగ ఉద్యోగులకు వెసులుబాటు కల్పించాలని,ప్రతి పీయస్‌లో ఎన్నికల సిబ్బందికి కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మూడు విడతలలో జరిగే పాల్గొననున్న ఎన్నికల సిబ్బందికి ఒకే విధమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాత్రి సమయాలలో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. అశక్త ఉద్యోగుల అభ్యర్థనలను అధికారులు స్వీకరించాలని ఆయన కోరారు.

## అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం



**మక్తల్ టౌన్,డిసెంబరు9 ప్రభాతవార్త :** అంతర్జాతీయ అవినీతి వ్యతిరేకదినమును పురస్కరించుకొని మక్తల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలిక ఉన్నతపాఠశాలలో 8,9,10,విద్యార్థిని/విద్యార్థులకు అవినీతి నిర్మూలనకై విద్యార్థులపాత్ర,మధ్యదళారుల వలన సమాజానికి లాభామా/నష్టమా? అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాసపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చెయ్యడం జరిగినది.కార్యక్రమం సమాచార హక్కు(రక్షణ) చట్టం,వారి ఆధ్వర్యంలో జరిగినది. జిల్లాఅధ్యక్షులు జి. నారాయణ మాట్లాడుతూ చట్టంయొక్క ఆవశ్యకతగురించి అవినీతిని నిర్మూలించే పద్ధతులగురించి వివరించడం జరిగినది.కార్యక్రమంలో ఎస్.హాజమ్మ ఆర్‌టిఐ రాష్ట్రమహిళాకన్వీనర్,బాలరాజ్ ఆర్‌టీఐ జిల్లాఉపాధ్యక్షులు,పుష్పలత ఉపతహశిల్దార్,సుధీర్, కురమూర్తి టీచర్,కిష్టయ్యగౌడ్ ఆర్‌టీఐ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన శ్రీధర్‌రెడ్డి దంపతులు

- ఎమ్మెల్యే జీఎంఆర్, మన్నె జీవన్ రెడ్డి సమక్షంలో చేరిక
- తాటికొండను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ



పార్టీలో చేరిన శ్రీధర్‌రెడ్డితో ఎమ్మెల్యే జిఎంఆర్, మన్నె జీవన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్/భూత్పూర్, డిసెంబర్9,ప్రభాతవార్త:** దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి రోజు రోజుకు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలను వీడి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారు.ఈసందర్భంగా భూత్పుర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి దంపతులు, వారి అనుచరులు మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నె జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు.తాటికొండ సర్పంచ్‌గా కల్పనశ్రీధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే జీఎంఆర్, మన్నె జీవన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తాటికొండ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేలా తమవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టరీత్యా చర్యలు

**బిజినపల్లి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్సై కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎస్సైశ్రీనివాస్ మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు చేసిన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన, తప్పుడు పోస్టులను పెట్టిన గ్రూపు అడ్మిన్ పై వారిపై చర్యలు ఉంటాయని సూచించారు. గ్రామ పంచాయతీ ఎలక్షన్స్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు జాగ్రత్తలు వహించాలని ఉల్లంఘించిన వారి పై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎలక్షన్ 48 గంటల ముందు ప్రచారం ముగించాలని, బెల్ట్ షాపులు కొనసాగిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎలక్షన్ల పై ప్రచారం చేసే వాహనాలు మైకుపర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఎన్నిక నిబంధనలను ఖచ్చితంగా పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎన్నికలు పారదర్శకంగా,స్వేచ్ఛగా జరిగేందుకు తన ఓటును ఎటువంటి భయాందోళనలు లేకుండా వినియోగించాలని సూచించారు. ప్రత్యేకంగా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు డబ్బు, మద్యం ప్రలోభాలు, బెదిరింపులు కలిగించడం వంటి చర్యలుపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన హక్కు కావడంతో దాన్ని నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు విభాగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు.

## మూడో విడత గ్రామపంచాయతీ సర్పంచు, వార్డు మెంబర్ల తుది జాబితా

**శ్రీరంగాపూర్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డ్ మెంబర్ అభ్యర్థుల వివరాలు మొత్తం 8 గ్రామ పంచాయతీలకు గాను 28 మంది సర్పంచ్ అభ్యర్థులకుగాను, 82 వార్డు మెంబర్లకు గాను 187 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని శ్రీరంగాపూర్ ఎంపీడీవో రవినారాయణ తెలియజేయడం జరిగింది.1) జానంపేట గ్రామంలో ముగునగరు సర్పంచులుగా,16వార్డు మెంబర్లుగాను,2) కంబాలపూర్ గ్రామంలో 5గురు సర్పంచులు గా,27 వార్డు మెంబర్లు గాను 3) నగరాల 2రు సర్పంచులుగా,20 వార్డు మెంబర్‌లు గాను 4) నాగసానిపల్లి ఇద్దరు సర్పంచులు గాను, 17 మంది వార్డు మెంబర్లుగా 5) షేర్ పల్లి ఇద్దరు సర్పంచ్,21 వార్డ్ మెంబర్లుగా 6) శ్రీరంగాపూర్ 6గురు సర్పంచులుగా, 35 వార్డ్ మెంబర్లుగా 7) తాటిపాముల4గురు సర్పంచులుగా, 32వార్డు మెంబర్లు 8) వెంకటాపూర్ 4గురు సర్పంచులుగా,19 వార్డు మెంబర్లుగా ఉన్నారు.

## బుద్దారం ప్రజలు విజ్ఞులు

- ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకుంటారు : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** మొదటి విడత సర్పంచ్ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా పర్యటించి గోపాల్ పేట మండలం బుద్దారం గ్రామంలో ప్రచారం ముగించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిమాట్లాడుతూ బుద్ధారం ప్రజలు విజ్ఞులని ప్రలోభాలకు,మాయమాటలకు మోసపోరని ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకొనిసేవాభావం కలిగిన శేఖర్‌గౌడ్‌ని సర్పంచ్‌గా ఎన్నుకుంటారన్న నమ్మకం తనకు ఉందని అన్నారు. బుద్దారం రిజర్వాయర్ రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముంపు రైతులకు సమ్మతమైన నష్టపరిహారం ఇప్పిస్తామని అన్నారు. రెండేండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమి లేదని బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేరాబోవుకాలంలో అభివృద్ధి చేసి చూపిస్తా అని స్పష్టం చేశారు. విద్యావంతుడు శేఖర్ గౌడ్ ను సర్పంచిగా గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం పెద్దమందడి మండలంలో విస్తృతంగా పర్యటించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మొదటివిడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అల్వాల్ అభ్యర్థి రాజవర్ధన్ రెడ్డి, అమ్మపల్లి,మోజర్ల, వేలుటూరు గ్రామాలలో బి.ఆర్.ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## భూత్పూర్‌లో 5 గురు సర్పంచులు, 44 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం

**భూత్పూర్,డిసెంబర్9,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలోని 19గ్రామ పంచాయతీలలో 174 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలంలోని 19గ్రామ పంచాయతీలకుగాను 5గురు సర్పంచులు ఏకగ్రీవం కాగా,174వార్డు సభ్యులకుగాను 44మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఏకగ్రీవమైన గ్రామపంచాయతీలు ఏవీఆర్ కాలనీ(తారునాయక్), భట్టుపల్లి (లక్ష్మమ్మ),చౌలతండా(కొర్ర మన్ని), పెద్ద తండా(ఉడత్యావత్ సుశీల),తాటికొండ(కల్పనారెడ్డి) ఏకగ్రీవమైనట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు.మిగిలిన 14గ్రామపంచాయతీలు అన్నాసాగర్, వెల్కిచర్ల,హస్నాపూర్,కప్పెట,కరివెన,కొత్తమొల్గర,కొత్తూర్,లంబడికుంట తండా,మద్దిగట్ల, పాత మొల్గర పోతులమడుగు,రావులపల్లి, శేర్పల్లి,తాటిపర్తి సర్పంచ్ పదవుల కోసం ఈ నెల 17న మూడోవిడత ఎన్నికలు నిర్వహిస్తారు.14సర్పంచి పదవుల కోసం రంగంలో 67 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.ఇక మండలంలోని 174 వార్డులకుగాను 44వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 130వార్డుసభ్యుల పదవుల కోసం 398మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.భూత్పూర్ మండలంలోని 19జీపీల పరిధిలోని 174 వార్డులకుగాను 98 వార్డులు జనరల్‌కు కాగా, 76 వార్డులు వివిధ కేటగిరిలకు సంబంధించి మహిళలకు రిజర్వేషన్ కల్పించారు.2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్, 2024 సామాజిక సర్వే ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.రిజర్వేషన్ల ప్రకారం 13 స్థానాలు ఎస్టీ (మహిళ), 14స్థానాలు ఎస్టీ(జనరల్),12స్థానాలు ఎస్సీ(మహిళ),19స్థానాలు ఎసీ(జనరల్), 16స్థానాలు బీసీ(మహిళ),24స్థానాలు బీసీ(జనరల్)లకు కటాయించారు.ఇవికాకుండా అన్ రిజర్వ్డ్(మహిళ)కు35వార్డులు, జనరల్‌కు 41 స్థానాలు రిజర్వు అయ్యాయి.భూత్పూర్ మండలంలోని సర్పంచులను రిజర్వేషన్లను ఒక్కసారి పరిశీలిస్తే తాటిపరి (జనరల్), కొత్తూర (బీసీ -మహిళ),కరివెన(బీసీ-మహిళ),వెల్కిచర్ల(బీసీ-జనరల్), భట్టుపల్లి (ఓసీ-జనరల్),మద్దిగట(ఎస్సీ-జనరల్),కప్పెట(బీసీ-జనరల్),కొత్తమొల్గర(ఓసీ-జనరల్) పోతులమడుగు(ఓసీ-జనరల్),అన్నాసాగర్ (ఓసీ-జనరల్), రావులపల్లి (బీసీ-జనరల్), శేర్పల్లి హెచ్(ఎస్సీ-మహిళ),హస్నాపూర్(ఓసీ-జనరల్),తాటికొండ(ఓసీ-మహిళ),పాతమొల్గర(ఎస్సీ-జనరల్),పెద్దతండా (ఎస్టీ-మహిళ), లంబడికుంట తండా(ఎస్టీ-జనరల్), ఏవీఆర్ తండా(ఎస్టీ-జనరల్), చౌలతండా(జనరల్-మహిళ)కు కేటాయించారు.

## పెదిరిపాడులో స్పోర్ట్స్ మీట్

**మద్దూరు, డిసెంబరు9 ప్రభాతవార్త:** పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదిరిపాడులో మంగళవారం స్పోర్ట్స్ మీట్‌ను సెక్టోరియల్ అధికారులు రాజేంద్రకుమార్, విద్యాసాగర్, శ్రీనివాస్, మధ్యాహ్న భోజన ఇంచార్జ్ యాదయ్యశెట్టి ప్రారంభించారు. విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో ఆకర్షణగా వినియోగించారు.అండర్-17 విభాగంలో కొక్కో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి క్రీడలను నిర్వహించారు. విద్యార్థులు జిల్లా-రాష్ట్ర స్థాయిలో రాణించాలని అధికారులుఆకాంక్షించారు.కార్యక్రమంలో హెచ్ఎంబాలకిష్టప్పతో పాటుఉపాధ్యాయులు శ్రీనివాసులు, భాస్కర్, రాజారత్నం, శబరి, రవీందర్ నాయక్, పీఈటీ కృష్ణవేణి, మల్లిక పాల్గొన్నారు.

## రైజింగ్ కాదు..క్లోసింగ్ తెలంగాణ

- రాష్ట్రాన్ని వెనకకు నెట్టుతున్నారు
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శ



మాట్లాడుతున్న మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ రూరల్, డిసెంబర్9,ప్రభాతవార్త:** రైసింగ్ తెలంగాణఅని గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్లోసింగ్ తెలంగాణ వైపు పాలనా సాగిస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్ నగర్ మండల పరిదిలోని వివిధ గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. రైతులు ఎరువుల కోసం లైన్‌లో ఉన్నారు. పండించిన పంటకు బోనస్ రావడం లేదు.. కరెంటు సరిగ్గా ఇవ్వడం లేదు.. తాగు నీరు కూడా సరిగ్గా ఇవ్వడం లేదు తెలంగాణను వెనుకకు నెట్టి వేస్తూ పాలనా సాగిస్తూ రేసింగ్ తెలంగాణ పేరుతో సమ్మిట్ నిర్వహించడం హాస్యాస్పదమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు కొనసాగించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. మన్యంకొండరోప్‌వె పనులు నిలిచాయని..బడ్జెట్ హోటల్ నిర్మాణం ఆగిందని...సాగునీరు ఇచ్చే పాలమూరు పనులను కూడా పూర్తి చేయలేదని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ కి ఈ ఎన్నికల్లో బుద్ది చెప్పాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. రెండు సంవత్సరాలు గడిచిన ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గ్రామాల్లో అమలు చేయలేదని..రానున్న రెండేండ్లలో కూడా వారి ఆస్తులు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. విలువైన భూములను అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుంటే భవిషయతులో గ్రామాలూ అభివృద్ధి అవుతాయని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు సర్పంచ్...గ్రామా సభ తీర్మానం చేస్తే ఇస్తారని ఎవరి బెదిరింపులకు భయపడవద్దని కోరారు.కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, రామచంద్రయ్య, మొగులయ్య గౌడ్, దేవేందర్ రెడ్డి, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి
- కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



కొత్తకోట పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** పోలీస్ స్టేషన్‌ల పరిశుభ్రతపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి, కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ప్రాంగణం, రిసెప్షన్, లాకప్, రికార్డు గదులను,కేసుల్లో సీజ్ అయి పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాలను పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అనేది ప్రజలకున్నమొదటి నమ్మకం.ఇక్కడికి అడుగుపెటట్టిన పౌరుడు ముందుగా స్టేషన్ రూపం చూస్తాడు. తర్వాత పోలీస్ సేవను చూస్తాడు. పరిశుభ్రతలో రాజీ ఉండకూడదని పనిఒత్తిడి ఎంత ఉన్నా స్టేషన్‌నుశుభ్రంగా ఉంచడం ప్రతిఒక్కరి విధని అలాగే నేరనిరోధంకేవలం నేరస్థుడిని పట్టుకోవడంలోనే కాక,కేసులకు సంబంధించిన అన్ని సాక్ష్యాలను సమగ్రంగా కాపాడడంలో ఉంద ని ఎస్పీస్పష్టం చేశారు. ప్రతి అధికారితన విధులు ప్రజల న్యాయ పోరాటానికి బాటలు వేయడంలో కీలకమని ఎస్పీ సూచించారు. స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రత లేమిని సూచిస్తూ ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరించారు. అదే విధంగా స్టేషన్ ఆవరణలో కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు క్రమబద్ధంగా శుభ్రంగా లేకుండా ఉన్న విషయాన్ని ఎస్పీ గుర్తించి కేసులో సీజ్ అయిన వాహనం అనేది కేవలం పరికరం కాదు అది న్యాయానికి మౌనసాక్ష్యం.అలాంటి సాక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని వెంటనే వాహనాలన్నింటిని శుభ్రపరిచి, కేసు వారిగా క్రమబద్ధీకరించి, రికార్డుల్లో సరిగా నమోదు చేయాలని ఎస్పీ అన్నారు. ఈ తనిఖీలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు,కొత్తకోట సిఐ రాంబాబు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు, కొత్తకోట ఎస్సై ఆనంద్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య రక్షణలో ప్రతి ఓటు కీలకం

**ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి : వనపర్తి పట్టణ సిఐ కృష్ణయ్య**



గ్రామ పంచాయతీ ఎన్నికల భద్రతపై కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

**వనపర్తి, డిసెంబరు9 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి, జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా నియంత్రించడానికి వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు, మంగళవారం వనపర్తి సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో వనపర్తి రూరల్ పోలీస్టేషన్ పరిధిలో సవాయిగూడెం, నాచహళ్లి పెద్దగూడెం, పెద్దగూడెం తాండ, కడుకుంట్ల, చందాపూర్, దత్తాయిపల్లి,చిట్యా గ్రామాలలో ప్రత్యేక పోలీసు బలగాలతో భారీ "ఫ్లాగ్ మార్చ్" కవాతు నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్ ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపు, చట్టాన్ని చేతులెత్తి చూపే వ్యక్తులకు కఠిన హెచ్చరిక, ప్రతి పౌరుడు నిర్భయంగా తన ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించేందుకు పోలీస్ ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని సీఐ తెలిపారు. ఎన్నికల పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడం, ఎవరి భయానికి లేదా ప్రలోభానికి లొంగకుండా ప్రజలు ధైర్యంగా ఓటు వేయేలా చేయడం మా బాధ్యత. ఓటు కేవలం హక్కు కాదు అది బాధ్యత, ప్రజాస్వామ్య పునాది" అని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల్లో ఎలాంటి విఘాతం చోటు చేసుకోకుండా, పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని వనపర్తి సీఐ తెలిపారు. ప్రజలు ఎలాంటి బెంగ లేకుండా తమ దైనందిన కార్యకలాపాలు అలాగే పోలింగ్‌లో పాల్గొనవచ్చు. ఎలాంటి చట్టవ్యతిరేక చర్యనైనా కఠినంగా అణచివేస్తామని అన్నారు. అదే విధంగా సీఐ ప్రజలకు పిలుపునిస్తూ యువత, మహిళలు, వృద్ధులు అందరూ ఓటు వేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడేది ఆయుధాలుకాదు పౌరుల బాధ్యతఓటు వేయండి గ్రామం బలపడుతుంది ప్రజాస్వామ్యం నిలబడుతుందని ఆయన అన్నారు.ఈ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో వనపర్తి రూరల్ ఎస్సైలు,జలందర్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రత్యేక పోలీసు బలగాలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డా ఆరోగ్యమే లక్ష్యం

- దవాఖానలో ఆశ కార్యకర్తలకు విశ్రాంతి గది నిర్మిస్తాం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- యెన్నం హెల్త్ కిట్ పంపిణీ



యెన్నం కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్9, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ నియోజకవర్గంలో తల్లి-శిశు ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతోస్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో "యెన్నం హెల్త్ కిట్"లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రసవం అనంతరం నవజాత శిశువులకు అత్య వసరంగా అవసరమయ్యే ఆరోగ్య పరిరక్షణ సామగ్రి తో తయారు చేసిన యెన్నంహెల్త్ కిట్‌ను ఎమ్మెల్యే స్వంత నిధులతో తయారు చేయించి నవజాత శిశువుల తల్లులకు అందజేస్తున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రజలు నమ్మి నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు.వారిఆరోగ్యం,సంక్షేమం, భద్రత నామొదటి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగే నియోజకవర్గంలోని ప్రతితల్లికి యెన్నం హెల్త్ కిట్ అందేలా నేనుస్వంత నిధులుకేటాయిస్తున్నానని, ఏ తల్లి- శిశువూ ఆరోగ్య సేవలకు దూరంగా ఉండకూడదుఅనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం"అని ఆయన పేర్కొన్నారు. యెన్నం హెల్త్‌కిట్‌లో నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే కీలక వస్తువులు, శిశువుకుఅవసరమైన మోలిక ఆరోగ్యసామగ్రి ఉండేలా ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవడం జరి గిందని ఎమ్మెల్యే గారు తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయిన తర్వాత తక్షణ సహాయంగా యెన్నం హెల్త్ కిట్ అందిం చడం జరుగుతుందని, శిశువు ఆరోగ్యంపై తొలి రోజు నుంచే రక్షణ కల్పించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది తగు సూచనలు, సలహాలను అందిస్తున్నారని చెప్పారు.ఆసుపత్రి ప్రాంగణంలో ఆశా కార్యకర్తలకు అవసరమైన విశ్రాంతి గది నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, సాదుల్లా శిలీవీ సమత, దిబీవీ రాము నాయక్, ప్రవీణ్ కుమార్,గౌస్,నరేందర్,మక్సూద్, వెంకటేష్ పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్

**బిజినేపల్లి, డిసెంబరు9 ప్రభాతవార్త:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించే పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలని నాగర్‌కర్నూలు జిల్లావిద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావ్ కోరారు. మంగళవారం నవోదయ పరీక్ష కేంద్రాల సెంటర్ సూపరింటెండెంట్‌లు, కేంద్ర స్థాయి పరిశీలకుల శిక్షణా శిబిరం బిజినేపల్లి ఆర్ఆర్ కన్వేషన్ హాలులో ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఉమ్మడి జిల్లా మొత్తం నవోదయ పరీక్షను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రిన్సిపాల్ భాస్కర్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాలలో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్ష నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సిఎస్ లు, సీఎల్ఓ లు అన్ని జాగ్రత్తలతో పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్ష నిర్వహణ విధులను వివరించారు. ప్రవేశ పరీక్ష ఇంఛార్జ్ వి.భాస్కరాచారి మాట్లాడుతూ అత్యంత పోటీతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరవుతున్న పరీక్షార్థుల కు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని, పరీక్ష నిర్వహణలో ఏ చిన్న పొరపాటు లేకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జీ.జానకి రాములు మాట్లాడుతూ వట్టెం నవోదయ విద్యాలయ ప్రాధాన్యతను, ప్రతిభావంతులైన పౌరులను అందించడంలో ఈ విద్యాలయ పాత్రను వివరిస్తూ, పరీక్ష రోజు ఉమ్మడి జిల్లాలో నియమితులైన వివిధ రూట్ అధికారులను పరిచయం చేశారు.ఈ శిక్షణా కార్యక్రమంలో 29 కేంద్రాల సిఎస్‌లు , సీఎల్ఓ లు, నవోదయ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 7115 మంది,1332 మంది తెలుగు మీడియం5808 మంది ఇంగ్లీష్, 16 మంది హిందీ మీడియం, నలుగురు ఉర్దూ, నలుగురు కన్నడ భాషలలో పరీక్ష వ్రాయనున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల కలెక్టర్ల ఆదేశాలతో జిల్లా పోలీసు అధికారులు బందోబస్తు, వైద్యాధికారులు వైద్య సదుపాయాలు, రెవెన్యూ అధికారులు తనిఖీ ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## కాంగ్రెస్ ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థులను భారీ మెజార్టీతో సర్పంచ్‌లుగా గెలిపించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని సర్పంచ్ అభ్యర్థిగా మట్ట వెంకటయ్యగౌడ్ యాదమ్మ ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామానికి అత్యధికనిధులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని యాదమ్మ వెంకటయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ య్నెం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహసభ జిల్లాఅధ్యక్షులు బచ్చురామకృష్ణ,మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్, నాయకులు పర్వత్‌రెడ్డి, సురేందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పెంచికలపాడు సర్పంచుగా బిఎన్ జయన్న ఏకగ్రీవం



పెంచికలపాడు గ్రామానికి ఏకగ్రీవంగా ఎన్నికైన జయన్న

**పెబ్బేరు, డిసెంబరు 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన బిఎన్ జయన్న నాయుడు కాంగ్రెస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జయన్న మాట్లాడుతూ పెంచలపాడు గ్రామానికి నన్ను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నిక చేసినందుకు గ్రామ పెద్దలకు ప్రజలకు యువకులకు అలాగే వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డికి,పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. వనపర్తి ఎమ్మెల్యేసహకారంతో మాగ్రామాన్ని పూర్తిగా అభివృద్ధి చేసుకుంటా మని సీసీ రోడ్లు, డ్రైనేజీలు మండలంలో ముందు ఉత్తమ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేసుకుంటామని తెలియజేశారు.

## శివ యాదవ్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యం

**బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల

**పెద్దమందడి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ మనిగిళ్ళ గ్రామ సర్పంచిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శివ యాదవ్ కత్తెర గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పెద్దమందడి మండలం మనిగిళ్ల గ్రామంలో శివకు మద్దతుగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో మనిగిళ్ళ గ్రామంలో జరిగిన అక్రమాలను, మాజీ మంత్రి కబ్జాల మీద ప్రశ్నించిన శివయాదవ్‌ను అక్రమంగా అరెస్టు చేయించి పోలీసులచే లాఠీ దెబ్బలు కొట్టించి నాటి పాలకులు పైశాచిక ఆనందం పొందారన్నారు. లాఠీ దెబ్బలు తిని కేసులను ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన శివ యాదవ్ కు ఎమ్మెల్యే మేఘారెడ్డి మనిగిళ్ల సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న శివ యాదవ్ ద్వారానే మనిగిళ్ళ గ్రామ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు వివి గౌడ్,అంజన్నయాదవ్, దేవర శివ, రమేష్‌గౌడ్,కాంగ్రెస్ నాయకులు అంబటి రమేష్, మద్దిలేటి, వెంకటన్న, హరిజన్ రత్నయ్య, మహేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, బోడి కృష్ణ, భూపని మన్యం, కొండ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోపన్‌పల్లిలో ఊపందుకున్న ప్రచారం



**దేవరకద్ర, డిసెంబరు9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం గోపన్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్‌సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగాఇంటింట ప్రచారంనిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి బలపరిచిన అభ్యర్థి వాకిటి పకిరన్న కత్తెర గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డ్ సభ్యులు మొదటి వార్డ్ సభ్యురాలు వడ్డె జయమ్మ, రెండవ వార్డ్ ఉప్పరి రాములు,3 మూడవ వార్డ్ కృష్ణవేణి,4వవార్డ్ గోరెపాష ,5వవార్డ్‌తూముకుంటవెంకటేష్. ఆరవవార్డ్ కె.శ్రీనివాసులు, ఏడవ వార్డ్ జయమ్మ, ఎనిమిదవ వార్డ్ బోయకొండన్న, తొమ్మిదవ వార్డ్ ఉప్పరి సత్యమ్మ, పదవ వార్డ్ గొల్ల కురుమన్నలు కలిసి ఇంటింటి ప్రచారంహోరాహోరీగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్‌సీనియర్ నాయకులు300 మందిప్రచారంలో పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

**దామరగిద్ద, డిసెంబరు9 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో దామరగిద్ద మండలంలోని గడిమున్కన్‌పల్లి, క్యాతన్ పల్లి, మొగల్‌మడక, కాన్‌కుర్తి గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను నారాయణపేట సిఐ శివశంకర్, ఎస్సై రాజు మంగళవారం ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. సమస్యాత్మకంగా గుర్తించిన ఈ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల రోజు ఎటువంటి అంతరాయాలు లేదా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పోలీస్ మూవ్‌మెంట్ ప్లాన్, సిబ్బంది డిప్లాయ్‌మెంట్, సర్వైలైన్ పరమైన అంశాలను అధికారులు సూక్ష్మంగా పరిశీలించారు. అదనంగా పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో రాకపోకలుసజావుగా సాగేందుకు మార్గదర్శకాలు పోలింగ్ రోజుస్థానిక పోలీస్ సిబ్బందికి ప్రత్యేక సూచనలు సేకరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు కావడంతో పహారా బందోబస్తును పెంచడం, స్ట్రైకింగ్ ఫోర్స్ సిద్ధంగా ఉండడం, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో సమన్వయం వంటికీలక చర్యలను అమలు చేస్తున్నామని తెలిపారు.ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని సీఐ తెలిపారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

## ఎన్నికల బరిలో తండ్రీ కూతురు


ఎన్నికల పోటీలో తండ్రీ కూతురు

**మాగనూర్, డిసెంబరు 9 ప్రభాతవార్త :** మూడవ విడత సర్పంచ్ ఎన్నికల్లో చిత్ర విచిత్ర సంఘటనలకు వేదికగా నిలుస్తున్నాయి. స్థానిక రాజకీయాల్లో పట్టు సాధించేందుకు, ప్రతిష్ఠ నిలుపుకోవడానికి కుటుంబ సభ్యులే ఒకరిపై ఒకరు పోటీకి దిగుతున్నారు. అనేక గ్రామాల్లో సర్పంచ్ పీఠం కోసం భార్యా భర్తలు, అత్తాకోడళ్లు, తల్లీకూతుళ్లు, అన్నదమ్ముళ్ల వంటి బంధువులు ఒకరి కొకరు పోటీ పడుతున్నారు. నారాయణపేట జిల్లా, మాగనూర్ మండలం కొల్పూర్ సర్పంచ్ స్థానానికి తండ్రి, కూతురు పోటీకి దిగారు. ఎస్సీ జనరల్ రిజర్వ్‌డ్ కావడంతో సర్పంచ్ పదవి కోసం ఏకంగా తండ్రి, కూతురే ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నారు. తండ్రి ముద్దురాములు, కూతురు ముద్దు నవ్య నామినేషన్ దాఖలు చేశారు. ముద్దు నవ్య అదే గ్రామానికి చెందిన నరసింహను 2011లో ప్రేమ వివాహం చేసుకుంది. వీరి కుటుంబాల మధ్య సంబంధాలు లేనట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరి మధ్య మాటలు కూడా లేవని గ్రామస్తులవినికిడి. ఇదివరకే నవ్య తండ్రి ముద్దు రాములు పలుమార్లు ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయారు. తన ఆస్తి సైతం కోల్పోయారు. ప్రజా ప్రతినిధిగా ఉండాలని అకాలఆంక్షతో నేటి వరకు కూడా ఎన్నికలలో పోటీ చేస్తూనే ఉన్నారు. ముద్దు రాములుకు కాంగ్రెస్‌పార్టీ మద్దతు తెలపగా, కూతురు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఉన్నారు. మొత్తం గ్రామంలో దాదాపు 1600 ఓట్లు ఉండగా 10 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ స్థానానికి మొత్తం ముగ్గురు పోటీ చేస్తుండగా తండ్రి, కూతురు పోటీలో ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కుటుంబ సభ్యులే ఒకరిపై ఒకరు పోటీ పడటం వల్ల, ఆ కుటుంబంలోని, మద్దతు బంధువులు ఎవరికి ఓటు వేయాలో తికమక పడు తున్న పరిస్థితి. ముద్దు రాములు చిరకాల స్వప్నం ప్రజా ప్రతినిధిగా కల నెరవేరనున్నట్లు గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

## రెండు గ్రామాల సర్పంచులు ఏకగ్రీవం

◆14 పంచాయతీలకు ఎన్నికలు ◆47 మంది సర్పంచ్ పీఠం కోసం పోటీ

**మాగనూర్, డిసెంబరు9 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా, మాగనూర్ మండలం గురురావు లింగంపల్లి, తలంకేరి గ్రామాల సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. లింగంపల్లిలో ఉప్పరి శైలజ, రంగమోళ్ళ వాణి, ఇడిగి లక్ష్మీ దేవమ్మ, వర్కూర్ రాధమ్మ, ఈడిగి రాధమ్మ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశారు. మంగళవారం శైలజ, వాణి, వర్కూర్ రాధమ్మ, రాధమ్మ తమ నామినేషన్ పత్రాలు ఉపసంహరించుకోగా ఈడిగి లక్ష్మీ దేవమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లింగంపల్లి లో ఉన్న 8 వార్డులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. తాళంకిరిలో శాంతోల అనిత, ఉప్పరి పోలమ్మ సర్పంచ్ స్థానాలకు నామినేషన్ వేశారు. శాంతోల అనిత తన నామినేషన్ పత్రాన్ని ఉపసంహరించుకోవడంతో ఉప్పరి పోలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆరు వార్డు స్థానాలు కూడా ఏకగ్రీవం అయ్యాయి. రెండు గ్రామాల్లో అన్ని పార్టీల నాయకులు, గ్రామస్తులుఏకగ్రీవానికి కృషిచేసి ఐక్యతనుచాటుకున్నారు. తలంకేరిలో నూతన సర్పంచ్ భర్త గతంలో ఎన్నికలలో ఓడిపోవడంతో పోటీ లేకుండా గ్రామస్తుల అభిప్రాయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యువకులు చెప్పుకొచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామ అభివృద్ధికి పాటుపడాలని గ్రామస్తులు కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఉప సర్పంచ్‌గా అవకాశం ఇద్దరు యువకులకురావడం విశేషం. తాళంకేరిలో ఫార్మర్ శ్యామ్, లింగంపల్లిలో ఆంజనేయులుకు గ్రామస్తులు పట్టంకట్టారు. గ్రామంలో అభివృద్ధి చేసి చూపిస్తామని యువకులు ప్రజలకు మాటిచ్చారు. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో మాగనూర్ మండలంలో 16 గ్రామ పంచాయతీల గాను రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అవ్వగా మిగిలిన 14 గ్రామ పంచాయతీలకుగాను 47 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 140 వార్డ్ స్థానాలకు 30 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 110 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

## ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి


పిఓలు, ఎపిఓలకు శిక్షణలో అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ ఆజ్మతుల్లా

**ఉప్పునుంతల, డిసెంబరు9 ప్రభాతవార్త:** ఈనెల 17న జరుగు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు ఓటములకు కీలకమని ఒక్కొక్క ఓటు చాలా ముఖ్యమని పిఓలు అత్యంత జాగ్రత్తగా పాటిస్తూ ఎటువంటి తప్పులు దొర్లకుండా ప్రశాంతంగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ ఆజ్మతుల్లా పిఓలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల కొత్త యశోద ఫంక్షన్ హాలులో జరిగిన ప్రిసైడింగ్ అధికారులకు (పిఓ) లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణలో పిఓ లను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ఎన్నికల సామాగ్రి తీసుకునేటప్పుడు బ్యాలెట్ బాక్స్ లు, బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామాగ్రి సరిగా ఉందా లేదా ఒకటి రెండుసార్లు చూసుకోవాలని వారికి సూచించారు. బ్యాలెట్ పేపర్లు సీరియల్ నెంబర్లు సరిగా ఉన్నాయా చూసుకోవాలని, బ్యాలెట్ బాక్స్‌లో మంచిగా పని చేస్తున్నాయా లేదా చూసుకోవాలని అవగాహన కల్పించారు. 17 మధ్యాహ్నం 1:00 వరకు పోలింగ్ కొనసాగుతుందని పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్స్‌ను సీల్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అప్పగించాలని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం రెండుగంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందని వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ విజయం సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేయాలని, అదేరోజు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని పిఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి ఎంపిడిఓ వరుణ్ తేజ, తహసీల్దార్ అద్దంకి సునీత, జిల్లా గెజిటెడ్ హెచ్ ఎంల సంఘం అధ్యక్షుడు, కాంప్లెక్స్ హెచ్ ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, మండలవిద్యాశాఖాధికారి చంద్ర శేఖర్, మాస్టర్ ట్రైనర్ ఆజ్మతుల్లా, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వెంకటేష్, వెల్టూర్ హైస్కూల్ ఇంఛార్జి రవిశంకర్, పిఓలు, ఏపీఓ లు తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంల తరలింపు

**నారాయణపేట, డిసెంబరు9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీఓ అనుమతితో, 17.10.2025 తేదీ మెమో నెం. 2248/ఎలక్షన్స్ ఎ/ఎ2/20251 ప్రకారం హెచ్‌ఓపి 2024 లో ఉపయోగించిన పేట, మక్తల్ నియోజకవర్గాల ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ నుంచి తరలించే ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం క్రాస్ రోడ్ వద్ద ఉన్న శ్రీ దత్తా బృందావన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్‌లో భద్రపరచిన ఈవీఎంలను అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తెరిచారు. జిల్లా కలెక్టర్‌సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను కలిసి స్ట్రాంగ్ రూమ్‌ను తెరిపించి లోపల ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. అనంతరం నిర్దేశించిన విధంగా ఈవీఎంలను నారాయణపేట ఆర్టీసీ బస్‌డిపో ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంలోకి తరలించారు. తరలింపు ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, సీసీటీవీ పర్యవేక్షణలో, రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలోనే నిర్వహించబడింది. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంపై త్రైమాసిక పరిశీలనను కూడాకలెక్టర్, అదనపు కలెక్టర్లు అదేసందర్భంలో చేపట్టారు. ఈ పరిశీలనలోనిల్వవిధానం, భద్రతా ప్రమాణాలు, రికార్డుల సంరక్షణనువివరణాత్మకంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓరామచంద్రనాయక్, కలెక్టరేట్ ఏవోశ్రీధర్ పాల్గొన్నారు. నారాయణపేట, మక్తల్ తహసీల్దార్లు అమరేంద్ర కృష్ణ, సతీష్‌కుమార్ కూడా వెంట ఉన్నారు. కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారిణులు జయసుధ, రాణి దేవి, ఇతరసిబ్బంది తరలింపు పనుల్లో పాల్గొన్నారు. ఈవీఎంల భద్రత, పారదర్శకతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.


స్ట్రాంగ్ రూమ్ తెరుస్తున్న దృశ్యం

## మొదటి విడత ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

■ పోలింగ్ కేంద్రాలలో 144 సెక్షన్ అమలు
■ వీసీలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని


వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు



**వనపర్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి తెలియజేశారు. డిసెంబర్ 11న జరిగే మొదటి దశ ఎన్ని కలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న మొదటి విడత 5 మండలాలు 87 గ్రామ పంచాయతీలు, 780 వార్డులకు గాను 5గ్రామ పంచాయతీల సర్పంచి, 104 వార్డు మెంబర్లు ఏకగ్రీ వంగా ఎన్నిక కాగా మిగిలిన 82 గ్రామ పంచాయతీ సర్పంచులు, 675 వార్డు మెంబర్ల ఎన్నికలను పారదర్శకంగా సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మొదటి విడత ఎన్నికలు నిర్వహించ నున్న 5మండలాల్లో డిసెంబర్, 9న సాయంత్రం 5 గంటల నుండి ప్రచార పర్వం ముగుస్తుందని, అంతేకాకుండా అన్ని వైన్ షాపులు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మూసివేయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రిపోల్ ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, డిస్ట్రిబ్యూ షన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి అవసరమైన పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల పంపిణీ, రూట్ వారిగా సిబ్బంది తరలింపు వంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్‌రోజు పోలింగ్ మేనేజ్మెంట్‌పై పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 936 మంది ప్రిసైడిం గ్ ఆఫీసర్లు, 1189 ఒపిఒలు వెరసి 2125 మంది సిబ్బందిని మూడవ ర్యాండమైజేషన్ ద్వారా ఆయా గ్రామ పంచాయతీలకు కేటాయించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 9.00గంటల వరకు పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకొని పోలింగ్ మెటీరియల్ తీసుకొని సాయంత్రం 5గంటల లోపు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకు నే విధంగా రూట్ వారిగా బస్సులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 11న ఉదయం 7గంటల నుండి పోలింగ్ ప్రారంభించి మధ్యాహ్నం 1.00 గంట వరకు పూర్తి చేసుకొని అనంతరం అదే రోజు అక్కడే లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించే విధంగా సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అదేరోజు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు నోటీస్ జారి చేసే విధంగాఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో 144 సెక్షన్ అమలు, సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్, 39 మంది మైక్రో అబ్జర్వలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఉదయం 9, 11,1.00 గంటవరకు పోల్ శాతం ఎప్పటికప్పుడు తెప్పించుకొని టి.పోల్‌లో నమోదు చేసే విధంగా ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రచారం ముగిసిన గ్రామాల నుండి ఇతర ప్రాంతాలకు సంబంధించిన వ్యక్తులను పంపించే విధంగా పోలీసు అధికారులకు సూచించినట్లు తెలియజేశారు. ఎన్నికల నిర్వహణ పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్, ఎనికల వ్యయ పరిశీలకులు యం. శ్రీనివాసులు, డిపిఓ తరుణ్ చక్రవర్తి, డివిజనల్ పంచాయతీఅధికారి రఘుపతిరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర రావు, జిల్లా రవాణ అధికారి మానస, నోడల్ అధికారులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## రెండేళ్లలో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని లేదు

పెద్దమందడి చెరువుకు శంకరసముద్రం (కానాయపల్లె) నుండి ఎత్తిపోతల ద్వారా నీటిని అందించి తీరుతా : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**పెద్దమందడి, డిసెంబరు9 ప్రభాతవార్త:** పెద్దమందడి మండలంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగాజగత్‌పల్లి, మనిగిల్ల, పెద్దమందడి, అల్వాల, అమ్మపల్లి, మోజర్ల, వెల్టూరుతదితర గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులు సుఖేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, స్వాతి జి.బాబు, రాజ మహేందర్ రెడ్డి, విట్ట విజయనిర్మల శ్రీనివాస్ రెడ్డి, కొత్త కాపు నరసింహరెడ్డి, దండు అశోక్ (చిట్టీ బాబు)ల తరుపున విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన గ్రామ గ్రామ సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పెద్దమందడి రైతాంగాన్ని ఆదుకోవాలని బుద్దారం బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగు నీరు అందించామని కానీ నీటి సరఫరా సకాలంలో అందడం లేదని యాసంగి వచ్చేవరకు చెరువు ఎండిపోతుందని నిపుణుల ద్వారా అంచనా వేయించి శంకర సముద్రం నుండి ఎత్తిపోతల పథకం రూపొందించి రైతుల కష్టాలు తీర్చాలని భావించామని అంతలోనే ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడం వల్లసాధ్యం కాలేదని అయినా పెద్దమందడి సర్పంచుగా స్వాతి హరికుమార్ రెడ్డిని గెలిపిస్తే ఎత్తి పోతల పథకం సాధిస్తా అని రైతాంగ వెతలు తీరుస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం మాయమాటలు చెబుతున్నారని నమ్మవద్దు అని మాకు ఓటు వేయకపోతే అభివృద్ధి ఆగిపోతుందని బెదిరిస్తున్నారని, రెండేండ్లు ఏమి చేయలేదని ఇప్పుడు ఏమి అభివృద్ధి చేస్తారని నిలదీయాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారా అభివృద్ధి జరుగుతుందని రేవంత్ రెడ్డి వల్ల ఏమి కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఆరు గ్యారంటీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలకు శూన్యహస్తం చూపిందని ఎద్దేవా చేశారు. రైతులకు రెండు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిందని, బోనస్ నేటికి రూ.1154కోట్లు రైతులకు బకాయి పడ్డదని రైతు రుణ మాఫీకి దిక్కు లేదని ఘాటుగా విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చిన రెండేండ్లలో2లక్షల 60వేల కోట్లు అప్పు చేసి ఏమిఎలగబెట్టారని అన్నారు. ఇక్కడి నాయకులు సొంత మండలం అని చెప్పి 10ఏండ్లలో చేయని అభివృద్ధి 2ఏండ్లలో చేస్తామని ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదని అడ్డం పొడుగు మాట్లాడడం తప్పా చేసింది ఏమి లేదని హేళన చేశారు. గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యం చేసింది. కార్మికులకు జీతాలు లేక, ట్రాక్టరుకు డీజిల్ పోసే దిక్కు కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో లేదనిఘాటుగా విమర్శించారు. హామీలు అమలు చేయాల ని గల్లా పట్టి నిలదీయండి. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకు లను మహిళకు రూ.2500/, ఆసరా పింఛన్లు రూ.4000/, తులం బంగారం, గ్యాస్ సబ్సిడీ, రైతులకు రైతు భరోసా, రైతు కూలీలకు రైతు భరోసా, ధాన్యానికి బోనస్, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు, కెసిఆర్ కిట్టు, కంటివెలుగు పథకాలు ఏమైనాయని నిలదీయాలని పిలుపునిచ్చారు. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమని కెసిఆర్ సుపరిపాలన, గ్రామాల అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గట్టుయాదవ్, జగదీశ్వర్ రెడ్డి, పలుస రమేష్ గౌడ్, సేనా పతి, అల్వాల జగన్మోహన్ రెడ్డి, చిన్న వెంకటరెడ్డి, అమ్మపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, పెద్దమందడి జెడ్పిటిసి కె.రఘుపతిరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, చిత్తూరు కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, బండారు కృష్ణ, ప్రేమ్‌నాథ్ రెడ్డి, స్టార్ రహీమ్, గులాం ఖాదర్ ఖాన్, ఇమ్రాన్, అరీఫ్, మంద రాము, అనిపాటి రాము, స్టార్ శ్రీనివాసులు పురుషోత్తం రెడ్డి. ప్రవీణ్ కుమార్ రెడ్డి, కురుమూర్తి, అలీమ్, మండలంలోని వివిధ గ్రామాల బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 3 గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవం

■ 66 వార్డ్ మెంబర్లు ఏకగ్రీవం
■ ఉప సర్పంచ్లుగా మోలాలి.కే రాణి, సర్వేశ్వర్ రెడ్డి


ఏకగ్రీవ సర్పంచుగా ఎన్నికైన చిన్నమోహన్ గౌడ్


ఏకగ్రీవ సర్పంచుగా ఎన్నికైన ఆర్. జయమ్మ

**ఇటిక్యాల డిసెంబర్ 9, ప్రభాతవార్త;** ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను మంగళవారం నామినేషన్లు ఉపసంహరణ అనంతరం ఇటిక్యాల మండలంలో వావిలాల. మొగలి రావల్ చెరువు. కొత్త ఎర్రవల్లి మండలంలోని ఆర్ గార్లపాడు గ్రామంలో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవోలు మహమ్మద్ అజార్ మొహియుద్దీన్, అబ్దుల్ సయ్యద్ ఖాన్ తెలిపారు. ఇటిక్యాల మండలంలో వావిలాల గ్రామ సర్పంచ్ స్థానానికి చిన్న మోహన్ గౌడ్ ఒకే అభ్యర్థి నామినేషన్ వేయగా అలాగే 10 వార్డ్ మెంబర్లకు ఒకే నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో మంగళవారం ఏకగ్రీవంగా ఒకే వార్డుకు ఒకే నామినేషన్లు దాఖలు కావడంతో 10 వార్డు నెంబర్లను ఏకగ్రీవం అయినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఏకగ్రీవ సర్పంచుగా చిన్న మోహన్ గౌడ్ ను అధికారులు ప్రకటించారు. సర్పంచ్ పదిమంది వార్డు మెంబర్లకు ఏకగ్రీవం కావడంతో వారికి నియామక పత్రం అందజేశారు. అనంతరం 10 వాడు మెంబర్లలో ఒకరిని ఉప సర్పంచ్ గా మోలాలిని ఎన్నుకున్నట్లు అధికారులు ప్రకటించారు. అదేవిధంగా మొగలు రావులచెరువు గ్రామంలో సర్పంచ్ స్థానానికి 4నామినేషన్లు దాఖలు చేయగా మంగళవారం నామినేషన్ల ను ముగ్గురు ఉపసంహరించుకోగా అనంతరం ఒకే నామినేషన్ ఉండటంతో ఆ గ్రామ ఏకగ్రీవ సర్పంచుగా ఆర్. జయమ్మ ను రిటర్నింగ్ అధికారి అమీర్ పాష ప్రకటించారు. అలాగే 8 వార్డు మెంబర్లు కూడా ఏకగ్రీవం కావడంతో వారికి నియామక పత్రం అందజేసి ఎనిమిది మంది వార్డ్ మెంబర్లలో కే. రాణి ని ఉప సర్పంచ్ గా ఎన్నుకున్నారు. అలాగే కొత్త ఎర్రవల్లి మండలంలోని ఆర్ గార్లపాడు గ్రామంలో సర్పంచ్ స్థానానికి తిమ్మారెడ్డి. 10వార్డులకు ఒక్కొక్క నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మంగళవారం ఆర్ గార్లపాడు ఏకగ్రీవ సర్పంచ్‌గా తిమ్మారెడ్డి ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికా రులు ప్రకటించారు. 10 వార్డ్ మెంబర్‌లు అభ్యర్థులు కూడా ఏకగ్రీవం అయ్యారు. వీరిలో ఉప సర్పంచ్‌గా సర్వేశ్వర్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఏకగ్రీవ సర్పంచ్ గ్రామాలలో అధికారుల విచారణ... ఇటిక్యాల మండలంలో మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వావిలాల సర్పంచ్. 10 వార్డ్ మెంబర్లు ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. అలాగే మొగలి రావల్ చెరువు గ్రామంలో సర్పంచ్ 8 వార్డ్ మెంబర్లు ఏకగ్రీవం అయ్యాయి. మంగళవారం సాయంత్రం మండల ఎన్నికల నోడల్ అధికారి తాహ సిల్దార్ వీరభద్రప్ప. ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్, ఎస్సై కే. రవి, ఆర్ఐ మదన్మోహన్ గ్రామాలలోకి వెళ్లి సర్పంచు. వార్డు మెంబర్లు ఏకగ్రీవం అవడంతో గ్రామ ప్రజలు, నామినేషన్ వేసి ఉపసంహరించుకున్న అభ్యర్థులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రలోభాలు. ఒత్తిళ్లకు. డబ్బుల వంటి వాటికి నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారా ఇంకా పలు అంశాల వంటి వాటిపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం అందరికీ ఆమోదమైన అభ్యర్థులను గ్రామప్రజలఆమోదంతోనే ఏకగ్రీవంగా ఆమోదించుకున్నామని రెండు గ్రామాల ప్రజలు అధికారులకు చెప్పుకున్నారు. ఈ కొరకంలో ఆ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు జిపిఓ లు పాల్గొన్నారు.

## కెసిఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

**మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**

**మక్తల్ టౌన్, డిసెంబరు 9 ప్రభాతవార్త :** కెసిఆర్ దీక్ష అమరుల త్యాగ ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది లాంటిది అని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ చౌరస్తాలో డా. బి.ఆర్ అంబేద్కర్ కి పూలమాల వేసిన అనంతరం తెలంగాణ తల్లివిగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కెసిఆర్ ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని నడిపి ఆనాటి కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మెడలు వంచి రాష్ట్ర ప్రక్రియను ప్రారంభం చేస్తున్నాం అని ప్రకటింపజేసిన చరిత్ర కేసీఆర్‌కి దక్కుతుందని ఆయన కొనియాడారు. ఆ రోజు ఎంతమంది విద్యార్థులు అమరులయ్యారని వారి ప్రాణత్యాగం ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది అయిందని వారన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు పదేళ్లపాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అభివృద్ధికి ఎంతో కృషి చేసిన చరిత్ర కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఈ రోజు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విషయంలో దొంగ వైఖరి అవలంబించడం వలననే వందలాది మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందని దానికి కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. స్థానిక సమస్య ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా, పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు అన్వర్ హుస్సేన్, జగ్గలి రాములు, మొగిలి అప్ప జుట్ల శంకర్ శివారెడ్డి సాగర్, సుతారి రవి, మనన్, రాజు, ఎలిగండ్ల బాలప్ప, వినోద్, అమ్రేష్, నేతాజీ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, నరసింహులునాయుడు, అప్పిగౌడు, నవీన్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే అమలు చేయలేదన్నారు. జనరల్ సీట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం కల్పించామన్నారు. కాంగ్రెస్ పార్టీ పరంగా జనరల్ సీట్లలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాలను మాడల్ విలేజ్ గా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రానున్న మూడేళ్లలో ప్రజా సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపారు. దేవరకద్రలో కోర్టు కేసులకు జిల్లా కేంద్రం పోకుండా ఎన్నికలఅనంతరం దేవరకద్రలోని కేసులు కొనసాగుతాయి అన్నారు. ఏడాది లోపలనే వంద పడకల ఆసుపత్రి ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా నేను ఉండి విద్యకు, ఆరోగ్యం పై మొదటి ప్రాధాన్యత ఇస్తున్నానన్నారు. అనంతరం ముచ్చింతల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సంగిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డిని, అప్పంపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పద్మ శ్రీనివాస్ రెడ్డి, దాసర్ పల్లి సర్పంచ్ అభ్యర్థి రామాపురం నర్సింగమ్మ అంజిరెడ్డిలను భారీ మెజార్టీలతో గెలిపించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఆర్గనైజేషన్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కడే వచ్చి.. చీపురు పట్టి ఊడ్చి..

మొదటి పేజీ తరువాయి భాగం..

తమకు రోడ్లు ఊడ్చడానికి ఝాడూ కొయ్యలు ఇవ్వడం లేదని వాటిని తామే సొంత డబ్బుతో కొనుక్కుంటున్నామని ఒక మహిళా కార్మికురాలు ఎమ్మెల్యేకు చెప్పింది. ఆ సమయంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న శానిటరీ సూపర్ వైజర్ నరేష్ అక్కడికి చేరుకోగా పారిశుద్ధ్య కార్మికులకు వారు కోరిన ఝాడూ కొయ్యలను వెంటనే కొని ఇవ్వాలని అనిరుధ్ రెడ్డి శానిటరీ అధికారిని ఆదేశించారు. జడ్చర్ల పట్టణంలో ఖాళీ స్థలాలకు సంబంధించిన యజమానులు అందరికీ నోటీసులు ఇవ్వాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల యజమానులు స్పందించని పక్షంలో మున్సిపల్ అధికారులే వాటిని శుభ్రం చేయించి, వాటికి సంబంధించిన భూ యజమానులకు పెనాల్టీలు వేయాలని ఆదేశించారు. ఉదయం 5గంటల నుంచి 8 గంటల వరకూ దాదాపు మూడు గంటల పాటు ఈ విధంగా ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటన కొనసాగినా పోలీసులు గానీ, మున్సిపల్ కమీషనర్ గానీ ఆయన వద్దకు చేరుకోలేదు. అయితే కొందరు కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు మాత్రం భారీ సంఖ్యలో ఎమ్మెల్యే చుట్టూ గుమిగూడి తమ సమస్యలను వివరించారు. అనిరుధ్ రెడ్డి చివరగా నేతాజీ చౌరస్తాలో అందరితో కలిసి టీతాగి వెళ్లారు. ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటనతో అందరు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.

## ఘనంగా క్లాస్‌మెట్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం



విద్యార్థులకు దేశ నాయకుల పుస్తకాల పంపిణీ చేస్తున్న క్లాస్‌మెట్ సభ్యులు

**ఉప్పునుంతల, డిసెంబరు 9 ప్రభాతవార్త:** క్లాస్‌మెట్ క్లబ్ 14 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాల రంగాపూర్, సరస్వతి శిశు మందిర్ శ్రీపురం ఉన్నత పాఠశాలలో 250 దేశ నాయకుల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపకులు శ్రీవాస రాఘవేందర్, జిల్లా కార్యదర్శి బంధం పరమేశ్వర ప్రసాద్, అచ్చంపేట డివిజన్ పిఎస్‌టిలు సూరిశెట్టి గణేష్, శివ శంకర్, దాచేపల్లి శ్రీనివాస్, రాజస్వప్రధానోపాధ్యాయులు గోపాల్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపకులు శ్రీవాసరాఘవేందర్ మాట్లాడుతూ 2026 సంవత్సరంలో 365 రోజులు ప్రతిరోజు క్లాస్‌మెట్ క్లబ్ కార్యక్రమం జరిగే విధంగా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు.

## కెసిఆర్ దీక్ష వల్లే తెలంగాణ రాష్ట్రం

◆ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, డిసెంబరు9 ప్రభావార్త:** విజయ దివస్‌సందర్భంగా డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.సి.ఆర్ సచ్చుడో తెలంగాణవచ్చుడో అంటూ నవంబర్ 29 నుండి డిసెంబర్ 9 వరకు చేసిన ఆమరణ దీక్షతో కేంద్రం తెలంగాణ ప్రకటన చేసిందని కెసిఆర్ రణబేరీ, ఆత్మార్పణకు సంకల్పించిన రోజు కాబట్టి డిసెంబర్9నీ విజయ దివస్ గా జరుపు కుంటున్నామని అన్నారు. డిసెంబర్ 9తర్వాత ఎన్నో ఒడిదొడుకులు, నిర్బంధాలు ఎదుర్కొని కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపారని కొనియాడారు. దేశ చిత్రపటంలో మాయమైన తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా మార్చిన ఘనత కెసిఆర్‌దే అనిఅన్నారు. ఆంధ్ర నాయకులు చెప్పు చేతల లో తెలంగాణ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలనుఆంధ్రకు తాకట్టు పెట్టేవిధంగా రేవంత రెడ్డి పాలన ఉన్నదని కెసిఆర్ ఆమరణ దీక్ష, అమరవీరుల త్యాగాల వల్ల వచ్చిన రాష్ట్రం నేడు తిరోగమన దశలో ఉందని ఇది భావితరాలకు ప్రమాదకరం అనిఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో సుపరిపాలన కావాలం టే మళ్ళీ కెసిఆర్ సర్కార్ రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పాఠశాలల అండర్ 14 క్రీడలు

**మక్తల్ టౌన్, డిసెంబరు9 ప్రభాతవార్త:** జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మక్తల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ని లో 69వ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ 14 సంవత్సరాలలోపు బాల బాలికల ఖో ఖో టోర్నమెంట్ కం సెలక్షన్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, నిర్వాహణ కార్యదర్శి బి.రూప ఆధ్వర్యంలో ఖో ఖో ఎంపికలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల జిహెచ్ఎం వెంకటయ్య గౌడ్, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఖో ఖో టోర్నమెంటులో మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల5 జిల్లాల నుండి 200 మంది బాలబాలికలు వంద మంది పిడి, పిఈటిలు పాల్గొన్నారు. నారాయణపేట, వనపర్తి ఖోఖో బాలికల జట్ల క్రీడాకారిణులను పాఠశాల జిహెచ్ఎం పార్టీ వెంకటయ్య గౌడ్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్రాంత పీఈటి బి.గోపాలం, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ లభిస్తాయని బాలబాలికలందరూ క్రీడల్లో క్రీడా నైపుణ్య ప్రదర్శించి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని వారు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 14 సంవత్సరాల లోపు క్రీడలను నిర్వహిస్తున్నపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రూపనువారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐదు జిల్లాల పిడీలు, పీఈటీలు సత్యనారాయణ, సాయినాథ్, రమేష్, వెంకటేష్, రాజు, మన్యం, మీనా కుమారి, పుష్ప, దీప, చంద్రకళ, గౌరీ, నరసింహారెడ్డి, చక్రి, కృష్ణ, 100 మంది పిడి పిఈటి లు 200 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.